# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా ఈరోజు ఏక్తానగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.
- ఆర్థికపరంగా పురోగతి సాధించడానికి చర్చలు, దౌత్యం అవసరమని కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.
- ప్రగతిశీల సమాజాన్ని ఏర్పాటు చేయడానికి జాతీయ ఐక్యత ఎంతో ఆవశ్యకమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా అన్నారు.
- తూర్పు లద్దాఖ్ లోని భారత్ - చైనా సరిహద్దుల మధ్య బలగాల ఉపసంహరణ ప్రక్రియ ఈరోజు పూర్తయింది.

============================

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు, ప్రవాస భారతీయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి సంతోషం, ఉత్సాహంతో కూడిన పండుగ అని, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రేమ, కరుణ వంటి సుగుణాలను అలవర్చుకోవాలని, సామాజిక సామరస్యాన్ని పెంపొందించాలన్నారు. కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందామన్నారు. ఆరోగ్యకరమైన, సంపన్నమైన బాధ్యతాయుతమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రతిజ్ఞ చేద్దామని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా ఈరోజు ఏక్తానగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుగా ఈ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఏక్తా నగర్ లో బోన్ సాయ్ గార్డెన్, సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంటు, సబ్ డిస్ట్రిక్ట్ హాస్పటల్ ను ప్రధానమంత్రి ప్రారంభించారు. 22 కోట్ల రూపాయల ఖర్చుతో 50 పడకల సామర్థ్యంతో నూతనంగా నిర్మించిన ఈ ఆసుపత్రి ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందించనుంది. అలాగే... ప్రధానమంత్రి 99వ కామన్ ఫౌండేషన్ కోర్సు ట్రైనీ ఆఫీసర్ లను ఉద్దేశించి ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్థికపరంగా పురోగతి సాధించడానికి చర్చలు, దౌత్యం అవసరమని కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. మూడు రోజుల సౌదీ అరేబియా పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన రియాద్ లో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్ మెంట్ ఇనిషియేటివ్ ప్లీనరీ 8వ ఎడిషన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక దౌత్యం ప్రపంచ సహకారాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లగలదు అనే అంశంపై పియూష్ గోయల్ ప్రసంగిస్తూ

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రగతిశీల సమాజాన్ని ఏర్పాటు చేయడానికి జాతీయ ఐక్యత ఎంతో ఆవశ్యకమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా అన్నారు. ప్రపంచ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఆయన న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐక్యతా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశాన్ని ప్రత్యేకమైనదిగా మార్చే సమ్మిళిత్వం, భిన్నత్వాల స్ఫూర్తిని మన విధానాలు ప్రతిబింబించేలా చూడటం అందరి బాధ్యత అని ఉద్ఘాటించారు. "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" ఆలోచనకు నాంది పలికింది సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జె.పి. నడ్డా అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - చైనా సరిహద్దులోని తూర్పు లద్దాఖ్ లో దెప్సాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 22న బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైందని, ఆ ప్రాంతాల్లో తాత్కాలిక గుడారాలను తొలగించడంతో పాటు నిర్మాణాలను కూల్చివేశామని ఆర్మీ అధికారులు తెలిపారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నాలుగున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న సైనిక ప్రతిష్టంభన తరువాత బలగాల ఉప సంహరణ జరిగిందన్నాయి. కమాండర్ స్థాయిలో చర్చలు కొనసాగుతాయని, త్వరలోనే సరిహద్దు గస్తీ తిరిగి ప్రారంభమవుతుందని, ఈ ప్రాంతంలో సాధారణ స్థితిని పునరుద్ధరించే దిశగా ఇది గణనీయమైన అడుగు అని ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వే... స్విట్జర్లాండ్ రవాణా, కమ్యూనికేషన్ల శాఖతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని రైల్వే శాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. రెండు దేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా ఈ ఎం.వో.యూ. చేసుకున్నామని పేర్కొన్నారు. భారతీయ రైల్వేలను ఆధునీకరించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం, ట్రాక్ నిర్వహణ సహా వివిధ రంగాలలో సహకారానికి ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని అశ్విన్ వైష్ణవ్ వివరిస్తూ....

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విపత్తుల ప్రతిస్పందన సంస్థ (NDRF) గత సంవత్సర కాలంలో 900కు పైగా సహాయక చర్యలను విజయవంతంగా నిర్వహించి, వేలాది మంది ప్రాణాలను కాపాడిందని కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ తెలిపారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో షహీద్ స్మృతి సమారోహ సందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్డీఆర్ఎఫ్... నమ్మకానికి చిహ్నంగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, కేరళలోని వాయనాడ్ లలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ధైర్యసాహసాలను ప్రదర్శించాయని పేర్కొన్నారు. అమరవీరుల ధైర్యసాహసాలను, నిబద్ధతను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర ఎన్నికలసందర్భంగా 288 అసెంబ్లీ స్థానాలకు గాను 7 వేల 995 మంది అభ్యర్థులు 10 వేల 905 నామినేషన్లు దాఖలు చేశారని ఆ రాష్ట్ర ఎన్నికల అధికారులు వెల్లడించారు. మహాయుతి కూటమి పార్టీలైన భారతీయ జనతా పార్టీ, శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ మిత్రపక్షాలైన కాంగ్రెస్, శివసేన (యూబీటీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ)లకు చెందిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పాటు వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్), ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిం పార్టీల అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారని అధికారులు తెలియజేశారు. నామినేషన్ల స్వీకరణకు నిన్నటితో గడువు ముగిసిందని, నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 4 చివరి తేదీ అని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వాయువ్య రైల్వే 50 ప్రత్యేక రైళ్లను నడుపుతోందని సీపీఆర్వో శశికిరణ్ తెలిపారు. అలాగే, ఇతర రైళ్లకు తాత్కాలికంగా 148 అదనపు బోగీలను జోడించామని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దీపావళి పండుగను భారత ఆర్మీ సిబ్బందితో జరుపుకొనేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ అరుణాచల్ ప్రదేశ్ పయణమయ్యారు. భారత్ - చైనా సరిహద్దు ప్రాంతమైన తవాంగ్లో మోహరించిన భారత ఆర్మీ సిబ్బందితో కేంద్ర మంత్రి దీపావళి జరుపుకోనున్నారు. ఈ పర్యటనలో ఆయన... సైనికులు, అధికారులను కలిసి, వారి సేవలను, అంకితభావాన్ని గుర్తు చేసుకోనున్నారు. సాయుధ దళాల సిబ్బందిని కలుసుకోవడానికి ముందు ఆర్మీ అధికారి మేజర్ రాలెంగ్నావో బాబ్ ఖాతింగ్ కు అంకితం చేసిన మ్యూజియం ప్రారంభోత్సవానికి హిమాచల్ ప్రదేశ్ పర్యటనకు వెళ్లనున్నారని సామాజిక మాధ్యమం వేదికగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రహదారులపై భద్రతను పెంచే ప్రయత్నంలో భాగంగా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈరోజు పాట్నాలో 38 హైవే పేట్రోలింగ్ వాహనాలను ప్రారంభించారు. జాతీయ రహదారుల్లో దొంగతనాలను తగ్గించడం, రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందించడం లక్ష్యంగా ఈ వాహనాలు పని చేయన్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాద బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా స్ట్రెచర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అమర్చడమే ఈ వాహనాల ప్రత్యేకతలని బీహార్ డీజీపీ అలోక్ రాజ్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,237 పాయింట్ల నష్టాల్లో ప్రారంభమై చివరకు 79,942 వద్ద ముగిసింది. నిఫ్టీ 126 పాయింట్లు నష్టపోయి 24,340 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.61 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా... బంగారం ఔన్సు 2,795 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

============================

============================